

మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పొజిషన్ చూపాలి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నాగన్‌పల్లి పరిధిలోని రామోజీ ఫిలింసిటీ వద్ద గతంలో పట్టాలుపొందిన పేదలకు ఇళ్ల స్థలాలు చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. ఇళ్ల పట్టాలు పొందినవారితో బుధవారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. 2007లో ప్రభుత్వం సర్వే నంబర్ 198, 203లలో నాగన్‌పల్లి, పోల్కంపల్లి, ముకునూరు, రాయపోల్ గ్రామాల 670 మందికి ఇళ్ల పట్టాలిచ్చిందని, ఏళ్లుగా వీరు పొజిషన్ కోసం చూస్తున్నారని వాపోయారు. దీనికి సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య మద్దతు తెలిపారు. సీపీఎం నాయకులు భాస్కర్, బి.సామేల్, జగదీశ్, జగన్, నర్సింహ, బుగ్గ రాములు, సీ.హెచ్.జంగయ్య, అంజయ్య, సీపీఐ నాయకులు కావలి నర్సింహ, రవీంద్రచారి, యాదయ్య, శివరాల లక్ష్మయ్య తదితరులున్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని ఫిలింసిటీ యాజమాన్యంతో మట్లాడి తగు నిర్ణయం తీసుకుంటామని ఆర్డీవో కె.అనంతరెడ్డి వారికి హామీ ఇచ్చారు.

వైభవంగా పల్లకీసేవ



కేశంపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కేశంపేట ధవళగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అలవేలు మంగ, పద్మావతీదేవి సమేత వేంకటేశ్వరస్వామి పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భక్తులు కడియాల నరసింహ తదితరులున్నారు.

పూల దారిలో..



ఇక్కడ కనిపిస్తున్న చెట్లు ఎండిపోయాయి అనుకుంటున్నారా? కాదు కాదు.. విరబూసి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. హరితహారంలో భాగంగా నాటిన చెట్లు రోడ్లకు ఇరువైపులా నిండుగా పూసి కనువిందు చేస్తున్నాయి. అటుగా వెళ్లే వాహనదారులు వాటిని చూస్తూ పరవశించిపోతున్నారు. వేసవి ప్రారంభం కావడంతో ఆకులన్నీ రాలిపోగా కొమ్మకొమ్మకు పూసి కట్టిపడేస్తున్నాయి. యాచారం మండలంలోని మీర్‌ఖాన్‌పేట సమీపంలో ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది. అయితే ఈ చెట్లపేరేమిటో స్థానికులు, అధికారులకు సైతం తెలియకపోవడం విశేషం.

- యాచారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి)

గ్యాస్ సబ్సిడీకి మొండిచేయి!

జిల్లాలో ఎల్‌పీజీ కనెక్షన్లు **13,39,852**

లబ్ధిదారులు **2,08,203**





- మూన్నాళ్ల ముచ్చటగా సబ్సిడీ గ్యాస్
- లబ్ధిదారుల ఖాతాల్లో జమకాని రాయితీ
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరిస్తోంది. మహాలక్ష్మి పథకం కింద అందాల్సిన గ్యాస్ సబ్సిడీ సొమ్ము జమ కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా గ్యాస్ సబ్సిడీకి లబ్ధిదారులను ఎంపిక చేశారు. దీని కోసం తెల్ల రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకున్నారు. మొదట్లో సబ్సిడీ డబ్బులు ఖాతాల్లో జమ అయ్యేవి. ప్రస్తుతం నిధులు జమ కాకపోవడంతో లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 90 శాతం మంది లబ్ధిదారులకు సబ్సిడీ అందడం లేదని సమాచారం.

రంగారెడ్డి అర్బన్/యాచారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకం కింద ప్రతి పేద కుటుంబానికి రూ.500కే వంట గ్యాస్ అందిస్తామని ఇచ్చిన హామీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో డబ్బులు జమ కాగా ప్రస్తుతం జమకావడం లేదని లబ్ధిదారులు

మిగతా 8వ పేజీలో...



నాగర్‌గూడలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

ఆదర్శం.. ఛత్రపతి జీవితం

షాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖ వక్త భాస్కరయోగి అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని భజరంగ్‌దళ్ జిల్లా కోకన్వీనర్ గూడెం రమేశ్ ఆధ్వర్యంలో బుధవారం నాగర్‌గూడ చౌరస్తా నుంచి షాబాద్ మండల కేంద్రం వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో అమోఘ్ దేశ్‌పతి, శివానందస్వామి, మాజీ ఎమ్మెల్యే కే.ఎస్. రత్నం పాల్గొన్నారు. అనంతరం షాబాద్‌లో ఆన్‌మోల్ గార్డెన్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 17 ఏళ్ల వయసులో శివాజీ యుద్ధం చేసి బీజాపూర్ సామ్రాజ్యానికి చెందిన తోర్నా కోటను సొంతం చేసుకున్నాడన్నారు. శివాజీ నిస్వార్థ సేవ, పని పట్ల అంకితభావం, మచ్చలేని వ్యక్తిత్వం యువతకు ఆదర్శం అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భజరంగ్ దళ్ నాయకులు, హిందూ సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వక ఇబ్బందులకు గురవుతున్నారని టీఎస్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. బుధవారం పెద్దషాపూర్ ప్రతాప్ నరేందర్‌రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులతో కలిసి మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక ఫీజు కట్టలేదని, హాల్ టికెట్ ఇవ్వం అని యాజమాన్యం విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. యాజమాన్యంతో మాట్లాడి కొందరు ఫీజులు చెల్లించేలా ఒప్పించగలిగామన్నారు. ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల తీరు సరికాదని, ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రఘు, సుధార్, సంపత్ పాల్గొన్నారు.

కబ్జాపై కదిలిన యంత్రాంగం

పులందరి వాగు ఆక్రమణపై చర్యలు

సర్వే చేసి హద్దులు తేల్చిన అధికారులు



పులందరి వాగు వద్ద సర్వే చేస్తున్న ఇరిగేషన్ ఏఈఈ హరిత, సర్వేయర్ సాయికృష్ణారెడ్డి

ఆదిభట్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని పులందరి వాగును ఓ వ్యక్తి కబ్జా చేస్తున్నట్లు ఎంపీ పటేల్‌గూడ ప్రజలు ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 12 'పులందరి వాగు కబ్జాకు యత్నం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులు వెళ్లి చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఇరిగేషన్ ఏఈఈ హరిత, రెవెన్యూ సర్వేయర్ సాయికృష్ణారెడ్డి, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి హాబీబ్‌ఉన్నీసా బేగం బుధవారం సర్వే చేశారు. బొంగ్లూర్ నుంచి ఎంపీపటేల్‌గూడ కల్వర్టు వరకు సర్వే చేపట్టి హద్దు రాళ్ల ఏర్పాటు చేశారు. బొంగ్లూర్‌లో సర్వే నంబర్ 50,51,53, ఎంపీపటేల్‌గూడలో 490, 495, 510 సర్వే చేసి హద్దు రాళ్ల ఏర్పాటు చేసినట్లు సర్వేయర్ తెలిపారు. ఇరిగేషన్ ఏఈఈ హరిత మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పులం దరి వాగులో మట్టిపోసి ఆక్రమించింది నిజమే నన్నారు. సదరు వ్యక్తిపై ఆదిభట్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వాగును, బఫర్ జోన్‌ను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవె న్యూ, ఇరిగేషన్, మున్సిపల్ సిబ్బంది ఎంపీ పటేల్‌గూడ ప్రజలు పాల్గొన్నారు.



కుర్మిద్ద మదర్ డెయిరీ పాల కేంద్రం వద్ద పాలు పారబోస్తున్న రైతులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

పాలు పారబోసి నిరసన తెలిపిన రైతులు

యాచారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రూ.40లక్షల పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు పాల ధర పెంచాలని డిమాండ్ చేస్తూ పాలను పారబోసి నిరసన తెలిపారు రాంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని కుర్మిద్ద గ్రామ పాడి రైతులు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పాడి రైతులు మాల్‌లోని మదర్ డెయిరీ పాల కేంద్రానికి పాలు పోస్తున్నారు. కొంతకాలంగా యాజమాన్యం పాల ధర తగ్గించడంతోపాటు బిల్లులు ఇవ్వడంలేదని ఆరు నెలలుగా విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. డెయిరీకి 25 ఏళ్లుగా పాలు పోస్తున్నామని, ఒక్కో గ్రామానికి రూ.40 లక్షల బల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు మదర్‌డెయిరీ పాలకవర్గ సభ్యులకు, అధికారులకు తెలిసినా పట్టించుకోవడం ఆరోపించారు. పాల బిల్లులు వెంటవెంటనే చెల్లించాలని కోరుతున్నా యాజమాన్యం పట్టించుకోవడంలేదని, సంస్థను నష్టాల్లోకి నెడుతున్నారన్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో కుర్మిద్ద చైర్మన్ మహేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అధ్వానం.. అతిథిగృహం



- నిజాం కాలంలో నిర్మించిన భవనం
- కన్నెత్తి చూడని ప్రజాప్రతినిధులు
- పట్టించుకోని అధికారులు
- నూతన భవనం నిర్మించాలని కోరుతున్న స్థానికులు

చేవెళ్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిజాం కాలంలో సేదదీరడానికి మూడు నాలుగు ఎకరాల స్థలంలో నిర్మించిన అతిథి గృహం పదేళ్లుగా వినియోగంలో లేక శిథిలావస్థకు చేరింది. పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి చెత్తాచెదారం వేయడానికి అడ్డగా మారింది. వర్షాలు కురిస్తే భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. మల, మూత్ర విసర్జనతోపాటు చుట్టు పక్కల చిరు వ్యాపారులు వేస్తున్న కవర్లు, వ్యర్థాలతో కంపు కొడుతోంది. ఈగలు, దోమలకు నిలయంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ మందుబాబులకు అడ్డగా మారింది. మండల కేంద్రానికి వచ్చిన ప్రముఖ నాయకులకు వసతి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇకప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిల భవనాన్ని కూల్చివేసి అదే

మిగతా 8వ పేజీలో...

నూతన భవనం నిర్మించాలి

నిజాం కాలంలో నిర్మించిన అతిథి గృహంలో అప్పట్లో పర్యటనకు వచ్చే నాయకులు అందులోనే విడిది చేశారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దాన్ని కూల్చి వేసి అక్కడే నూతన భవనం నిర్మించాలి. శుభ్రం చేసే వారు కూడా లేకపోవడంతో వర్షాకాలం వస్తే కూలిపోయే స్థితికి చేరుకుంది. చేవెళ్ల పార్లమెంట్, అసెంబ్లీ కేంద్రంలో ప్రభుత్వ అతిథి గృహం లేకపోవడం సరైంది కాదు.

- డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, బీజేపీ యువ నాయకుడు చేవెళ్ల

నిధుల్లేక నిర్మాణానికి బ్రేక్

- అర్ధంతరంగా నిలిచిన మోడల్ మార్కెట్ నిర్మాణ పనులు
- రోడ్లపైనే కూరగాయలు, చికెన్, మటన్ షాపులు
- ఇబ్బందులు పడుతున్న షాద్‌నగర్ పట్టణ ప్రజలు



స్లాబ్‌కే పరిమితమైన మోడల్ మార్కెట్ భవనం

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లో చేపట్టిన మోడల్ మార్కెట్ నిర్మాణ పనులు నిధుల కొరతతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఏడాది క్రితం పనులు నిలిచిపోయాయి. తిరిగి పనులు ప్రారంభం కాలేదు. దీంతో కూరగాయలు, మాంసం, చికెన్, చేపలను రోడ్లపైనే విక్రయిస్తున్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ భవనానికి ఆనుకొని ఉన్న కూరగాయల మార్కెట్ యార్డును చౌడమ్మగుట్ట వద్ద నిర్మించిన నూతన కూరగాయల మార్కెట్ యార్డుకు తరలించారు.

రూ.4.5 కోట్లతో నిర్మాణ పనులు

పాత కూరగాయల మార్కెట్ యార్డులోని రెండెకరాల స్థలాన్ని సమీకృత(మోడల్) మార్కెట్ నిర్మాణానికి కేటాయించారు. కూరగాయలు, మాంసం, చికెన్, చేపలు, పూల విక్రయాలు ఒకే చోట జరిగేలా సముదాయ నిర్మాణానికి రూపకల్పన చేశారు. నిర్మాణానికి రూ.4.50 కోట్లను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. కూరగాయల విక్రయాల కోసం 118 షాపులు, మాంసం, చికెన్ విక్రయాల కోసం 30 షాపులు, పూల విక్రయాల కోసం ఎనిమిది షాపుల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ముందుగా గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు వైపులా దుకాణాలను నిర్మించి, రెండింటికీ అనుసంధానంగా పైకప్పుగా రేకులు వేసేలా పనులు చేపట్టారు. అయితే గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు మొదటి అంతస్తు నిర్మించాలని ఒక సముదాయానికి స్లాబ్ వేశారు. రెండో సముదాయానికి ఫుట్టింగులు, బేస్‌మెంట్‌ను పూర్తి చేసి, కొంతవరకు పిల్లర్లు వేశారు. నిధుల మంజూరులో జాప్యం.. తర్వాత ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. అదనపు నిధుల కోసం మున్సిపాలిటీ అధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ నేటివరకు నిధులు మంజూరు రాకపోవడంతో కాంట్రాక్టర్ నిర్మాణ పనులవైపు కన్నెత్తి చూడడం లేదు. అర్ధంతరంగా నిలిచిపోయిన మోడల్‌మార్కెట్ సముదాయ పనులను పూర్తి చేయడానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సక్రమంగా అందని రైతు భరోసా

ధారూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం పంట పెట్టుబడి సాయం కింద ఇస్తున్న రైతుభరోసా డబ్బు కొందరు రైతుల ఖాతాల్లో జమకావడం లేదు. అలాగే కొందరికి ఉన్నదానికంటే తక్కువ విస్తీర్ణానికి డబ్బులు పడుతున్నాయి. డబ్బులు పడనివారు, తక్కువ డబ్బులు వచ్చిన రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ధారూరు, కేరెల్లి, దోర్నాల్, నాగారం, నాగసమందర్ తదితర గ్రామాల్లో రైతుభరోసా సక్రమంగా పడలేదని చెబుతున్నారు. నాగమందర్ రైతు బాలప్పకు 1ఎకరం 15గుంటల భూమికి రూ.750 మాత్రమే జమైంది. వాస్తవానికి ఈ రైతుకు రూ.7,500 జమ కావాలి. ఇలా చాలా మంది రైతులకు రైతు భరోసా సరిగ్గా రావడం లేదు. గతంలో రైతుబంధు డబ్బులు సరిగ్గానే వచ్చేవని, ఇప్పుడేమైందో అర్థం కావటంలేదని రైతులు వాపోతున్నారు. డబ్బులు రాని వారికి పోర్టల్‌లో టు బి ప్రాసెస్డ్ అని, కొందరికి సబ్మిటెడ్ ఇన్‌బిల్స్ అని స్టేటస్ చూపిస్తోందని చెబుతున్నారు. సమస్యను అధికారులు పరిష్కరించాలని కోరుతున్నారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి సూర్యప్రకాశ్ స్పందిస్తూ..డీబీటీ స్టేటస్‌లో టు బి ప్రాసెస్డ్, సబ్మిటెడ్ బిల్స్ అని ఉంటే పూర్తివిస్తీర్ణానికి డబ్బులు వస్తాయని, ధరణి, రికార్డుల్లో సమస్యలున్న వారు రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు.

క్రీడల్లో గెలుపోటములను సమానంగా భావించాలి



కొందుర్గు కబడ్డీ క్రీడాకారులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ఆటలో క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా భావించి క్రీడాస్ఫూర్తితో మెలగాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం కొందుర్గులో శివాజీ జయంతిని పురస్కరించుకొని శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 11వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కబడ్డీ ప్రాచీన ఆట అని, పోటీలను ప్రారంభించడం సంతోషమని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాములుగౌడ్, నరేందర్, పురుషోత్తంరెడ్డి, కావలి యాదయ్య, కృష్ణ, శివాజీ యూత్ అధ్యక్షుడు యాదగిరి, నరేందర్, మధు, లింగం క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. కొందుర్గులోని ఎస్సీ గురుకుల పాఠశాలను షాద్‌నగర్ ఎమ్మెల్యే తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజన వసతిని కల్పిస్తోందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, సమాజానికి పేరు తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే వెంట స్కూల్ ప్రత్యేకాధికారి కుర్షీద్, జీబీ కృష్ణ ఉన్నారు.

గడువు ముగిసినా చర్యలేవి?



పన్ను బకాయి ఉన్న సన్సార్ హోటల్

తాండూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 24గంటల్లో ఆస్తిపన్ను చెల్లించాలని మన్సిపల్ అధికారులు హెచ్చరించి గడువుదాటినా బకాయిలు చెల్లించలేదు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ పక్కనున్న సన్సార్ హోటల్ అండ్ రెస్టారెంట్ పన్ను బకాయి మంగళవారం(ఈ నెల 18న) కల్లా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. గడువు దాటినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. రూ.11లక్షల పన్ను బకాయిలపై చర్యలు తీసుకుంటారా? లేదా అనే అంశంపై పట్టణంలో చర్చ జరుగుతోంది. హోటల్ నిర్వాహకులను మున్సిపల్ అధికారులు మొదట హెచ్చరించి చర్యలెందుకు తీసుకోవడం లేదని అంటున్నారు.

సర్వేచేసిన టీచర్లకు అటెండెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

● ఎంపీడీవోకు యూటీఎఫ్ మండల నాయకుల వినతి

కందుకూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం మండలంలో ఇటీవల నిర్వహించిన సమగ్ర సర్వే చేసిన ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్లను ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రవి, జె.బుగ్గరాములు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సరితకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వం చేసిన సర్వేలో జనరల్ హాలిడేస్‌లలో కూడా పనిచేసినందుకు ప్రభుత్వం సీసీఎల్‌లను మంజూరు చేసిందన్నారు. సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు లీవులను పొందేందుకు ఎంపీడీవో అటెండెన్స్ సర్టిఫికెట్లను ఇవ్వాల్సి ఉందన్నారు. తాము చేసిన వినతికి ఎంపీడీవో సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సర్టిఫికెట్లు జారీ చేస్తామని ఆమె హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ 2025 డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.బక్యానాయక్, వి.మహేష్, బి.జైపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో సరితకు వినతి పత్రం ఇస్తున్న టీఎస్ యూటీఎఫ్ నేతలు

ప్రగతిని అడ్డుకోవడమే కేటీఆర్ పని



విలేకరులతో మాట్లాడుతున్న క్యామ రాజేశ్

కడ్తాల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుంటే ఓర్వలేని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతుల పేరుతో దొంగ దీక్షలు చేస్తున్నారని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడం, ప్రగతిని అడ్డుకోవడమే కేటీఆర్ దినచర్యగా మారిందని మండిపడ్డారు. కడ్తాలలో బుధవారం విలేకరుల సమావేశంలో రాజేశ్ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులను అన్ని విధాలా మోసగించారని ఆరోపించారు. రుణమాఫీ చేస్తామని నాలుగు విడుతల్లో కొద్దిమందికే చేసినా అదీ మిత్తిలకే సరిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసిందని తెలిపారు. రైతుబంధును అనర్హులకు, పడావు భూములకు ఇచ్చి ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ఆరోపించారు. సీఎంను విమర్శించడం మానకుంటే కేటీఆర్‌కు ప్రజలే తగిన బుద్ధి చెప్తారని అన్నారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, మండల అధ్యక్షుడు బోసు రవి, పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్, ఎర్రోళ్ల శ్రీకాంత్, సాయిగౌడ్, నరేశ్, ఆకాశ్‌గౌడ్, రమేశ్‌నాయక్, మహేశ్, తులసీరామ్, శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్, రామకృష్ణ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి



తలకొండపల్లిలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. అభివృద్ధిని అడ్డుకునే వారిని ప్రజలు ఉపేక్షించబోరని అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, అంతారం, వెల్జాలలో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహతో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం కసిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలు, తండాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలిపేందుకు ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. సీఆర్ఆర్ గ్రాంట్ కింద నియోజకవర్గానికి రూ.11.5కోట్లు మంజూరయ్యాయని.. ఆ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లోని దళితవాడల్లో సీసీరోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ రాజ్ రహదారులను వేగవంతంగా అభివృద్ధి చేసి రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం హ్యామ్ తొలి పైలెట్ ప్రాజెక్ట్ కింద కల్వకుర్తి నియోజకవర్గాన్ని ఎంపిక చేసినట్లు నారాయణరెడ్డి తెలిపారు. ఎంపీడీవో శ్రీకాంత్, తహసీల్దార్ నాగార్జున, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మిట్టపల్లి అంజయ్య, డాక్టర్ శ్రీనివాస్, అజీం, వెంకట్ రెడ్డి, శ్యామ్‌సుందర్ రెడ్డి, జిల్లా నాయకుడు కాను శ్రీనివాస్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, రవీందర్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి, రమేశ్, ఆరిఫ్, జనార్దన్, యాదయ్య, యాదగిరి, పాండు పాల్గొన్నారు.

అనంత పద్మనాభస్వామి ఆలయ వార్షికోత్సవం

చేవెళ్ల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): దేవరంపల్లిలో గల అనంత పద్మనాభ స్వామి ఆలయం వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే యాదయ్య ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, బీజేపీ అధ్యక్షుడు అనంతరెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, బీజేపీ యువ నాయకులు డాక్టర్ మాల్గారి వైభవ్ రెడ్డి, దేవరంపల్లి గ్రామం మాజీ సర్పంచ్ నరహరిరెడ్డి, నాయకులు ఉన్నారు.

కనుల పండువగా శివ పడిపూజ



షాబాద్: సంకేపల్లిగూడలో పూజలు

షాబాద్: స్వామియే శరణం శివ స్వామి అంటూ సంకేపల్లిగూడ మార్మోగింది. షాబాద్ మండలం సంకేపల్లిగూడలో బుధవారం శివ స్వాముల పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ చెన్నయ్య, గ్రామస్తులు నర్సింహారెడ్డి, సాయికృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, లింగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్‌లో మార్మోగిన శివనామస్మరణ

పెద్దేముల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం శివనామస్మరణ మారుమోగింది. శంభులింగేశ్వరస్వామి ఆలయం వద్ద శివస్వాములు పడిపూజ నిర్వహించారు. శివమాల ధారణ చేసిన శివస్వాములు 41రోజుల పాటు శివదీక్ష చేశారు. వారు శ్రీశైలం బయలు దేరేందుకు ఇరుముడులు కట్టుకున్నారు. శివస్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజకు హాజరైన వారికి టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్ అన్నదాన వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, నరేశ్‌రెడ్డి, డీవై.నర్సింహులు, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివస్వాముల పడిపూజ

కడ్తాల్: కర్కల్ పహాడ్‌లో శివస్వాముల పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివస్వాములు, భక్తులు పూజలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిపూజ కొనసాగింది. భక్తుల శివగీతాలాపనలు, భజనలు అందరినీ అలరించాయి. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ సర్పంచ్ నాగమణి వెంకోబా, మార్కెట్ డైరెక్టర్లు మిట్టపల్లి అంజయ్య, నరేశ్ నాయక్, నాయకులు వీరయ్య, శ్రీను, రమేశ్, విష్ణు, పురుషోత్తం, జలాలుద్దీన్, అశోక్, స్కైలాబ్, శివస్వాములు మల్లేపల్లి శేఖర్, శ్రీను, అర్జున్, పట్నం కృష్ణయ్య, అశోక్, శివారాజ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి



పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తాండూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉందని, ఈ బడ్జెట్‌లో సవరించాలని సీపీఎం డిమాండ్ చేసింది. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో తాండూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్, యు.బుగ్గప్ప మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం ప్రజల మౌలిక వసతులను కేటాయింపులు తగ్గించి, సంపన్నులకు రాయితీలు పెంచిందని విమర్శించారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేట్‌కు అప్పగించే ఆలోచనను విరమించుకోవాలని, ఉపాధి హామీ పథకానికి 50శాతం నిధులు పెంచి, పట్టణాలకు ఉపాధి హామీ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి సబ్సిడీ పెంచాలని, మహిళా శిశు సంక్షేమం నిధులు కేటాయించి స్కీమ్ వర్కర్లకు గౌరవ వేతనంలో కేంద్రం వాటా పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహిబూబ్, రాజు, లాలప్ప, బాలస్వామి, శేఖర్ పాల్గొన్నారు.

'కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్'

పరిగి: కార్పొరేట్ల అనుకూల విధానాలను అనుసరించే విధంగా ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్‌ను సవరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో పరిగిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులైన పెట్టుబడిదారులపై విధించే పన్నును 22 నుంచి 15 శాతానికి తగ్గించి పేద, మధ్యతరగతి ప్రజలు ఉపయోగించేవాటిపై 200 శాతం పెంచిందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ హబీబ్, సత్తయ్య, మహిపాల్‌రెడ్డి, రఘురాం, శేఖర్, మొగులమంచ చెన్నారెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబయిన ఎల్లమ్మ ఆలయం

- నేటి నుంచి పోలెపల్లిలో జాతర
- మినీ మేడారాన్ని తలపించేలా ఉత్సవం
- ఐదు రోజులపాటు నిర్వహణ
- 21న సిడె కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి



పోలెపల్లి ఎల్లమ్మ ఆలయం



ఎల్లమ్మ దేవత మూల విరాట్టు

దుద్యాల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలం పోలెపల్లిలో ఎల్లమ్మ జాతర ఈ నెల 20(నేటి) నుంచి ప్రారంభం కానుంది. యేటా ఎల్లమ్మ జాతరకు హైదరాబాద్, ముంబాయి, పుణె, షోలాపూర్, భీవండి తదితర దూర ప్రాంతాల భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. నేటి నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. 400ఏళ్ల క్రితం ఓ రైతు తన పొలంలో ఈ ఆలయాన్ని నిర్మించాడని చెబుకుంటారు. అయితే ఆలయాన్ని నిర్మించింది దాదాపురం దొరలని, కాదు ముజాయిత్‌పూర్ దొరలని పోలెపల్లి పూర్వీకులు చెబుతున్నారు. అప్పటి నుంచి ఎల్లమ్మ నిత్య పూజలందుకుంటోంది. 1973లో ఈ ఆలయం ఎండోమెంట్ శాఖలో విలీనమైంది. ఎల్లమ్మకు పోలెలు(భక్షాలు) అంటే ఇష్టం. భక్తులు పోలెలు నైవేద్యంగా సమర్పిస్తారు. అందుకే ఈ గ్రామానికి పోలెపల్లి అని పేరు వచ్చిందని గ్రామస్థులు చెబుతారు. ఎల్లమ్మకు కల్లుసాక పోస్తారు. ఉపవాస దీక్షలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. జాతరలో ప్రధాన ఘట్టం సిడె. దీనిని తిలకించేందుకు తరలివస్తారు. షోలాపూర్ వాసుల పూజలు ఆకర్షణగా నిలుస్తాయి.

● ఉత్సవాల్లో జరిగే కార్యక్రమాలివే..

ఉత్సవాల మొదటి రోజు ఈ నెల 20న(గురువారం) వేంచేపు కార్యక్రమం, అమ్మవారి పల్లకి సేవ, ప్రభోత్సవం, 21న జాతర, సాయంత్రం సిడెలాగే కార్యక్రమం, 22న రథారోహణం, 23న ప్రత్యేక పూజలు, 24న రాత్రి అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ చైర్మన్ జయరాములు, ఈవో రాజేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సిడె ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. వివిధ రాష్ట్రాల భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. మహిళలు బోనాలతో కోడి పుంజులు, పొట్టేళ్లతో, డప్పుల దరువుల మధ్య ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. మినీ మేడారంగా పిలవబడే ఎల్లమ్మ జాతర సిడె కార్యక్రమానికి లక్షకు పైగా భక్తులు హాజరవుతారు. సిడె రథాన్ని రూ.6.5లక్షలతో పోలెపల్లికి చెందిన వెంకటేశ్ తయారు చేయించారు. అలాగే నూతన రథాన్ని దాతల సహకారంతో చేయించారు.

● 21న జాతరకు సీఎం రేవంత్‌రెడ్డి

పోలెపల్లి జాతర ప్రధాన ఘట్టం ఈ నెల 21న జరిగే సిడె కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామ శివారులో హెలిప్యాడ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు చేశాం



ఎల్లమ్మ జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. 21న ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం సిడె కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. సిడెలో లక్షకుపైగా భక్తులు పాల్గొనే అవకాశం ఉంది.

\- జయరాములు, ఆలయ కమిటీ చైర్మన్

పోలెపల్లి ఎల్లమ్మ దర్శనంతోనే రేవంత్‌రెడ్డి ప్రచారం ప్రారంభం

కొడంగల్: పోలెపల్లి ఎల్లమ్మ దర్శనానికి ఈ నెల 21న సీఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు సంయుక్తంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి అధికారులతో పర్యవేక్షిస్తున్నారు. ఫార్మా కారిడార్ భూ సేకరణలో భాగంగా పోలెపల్లి, హకీంపేట్, లగచర్ల భూ బాధితులు కొన్ని రోజుల క్రితం కలెక్టర్, ఇతర అధికారులపై దాడికి పాల్పడిన నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి మొదటి సారి సొంత నియోజకవర్గం కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని పోలెపల్లి జాతరలో ప్రధాన ఘట్టం సిడె కార్యక్రమానికి హాజరు కానున్నారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ తరఫున ప్రచార కార్యక్రమం సందర్భంగా పోలెపల్లి నుంచే ప్రారంభించారు. అదే తరహాలో 2014, 2018, 2024 అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోలెపల్లి ఎల్లమ్మ దర్శనంతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి పోలెపల్లి ఎల్లమ్మ ఆశీస్సులతో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడం, మూడో సారి 2024లో ఎమ్మెల్యేగా గెల్చి సీఎంగా బాధ్యతలు చేపట్టారు.



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇతర అధికారులు

● సీఎం పర్యటనకు ఏర్పాట్లు

కొడంగల్/దుద్యాల: మినీ మేడారంగా కొనసాగే జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపడతారు. 21న జరిగే సిడె కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి రానుండటంతో ఏర్పాట్లనుఅధికారులు ముమ్మరం చేశారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. బుధవారం తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డీఎల్‌పీవో శంకర్‌నాయక్‌తో కలిసి పోలెపల్లిలో పర్యటించారు. శానిటేషన్, పార్కింగ్, తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాలు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్ కుమార్, తహసీల్దార్ కిషన్ నాయక్, ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి, చైర్మన్ జయరాములు, పంచాయతీ కార్యదర్శులు రాధిక, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రాక నేపథ్యంలో ఎక్సైజ్ దాడులు

కొడంగల్: పోలెపల్లి జాతరకు సీఎం పర్యటన నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రంగారెడ్డి ఆదేశాల మేరకు తండాల్లో దాడులు నిర్వహించారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలంలోని పాలబాయి, మేడిచెట్టు, బోడబండ, బాపల్లి తండాల్లో సారా బట్టీలపై సీఐ వెంకటేశ్ పోలీసు సిబ్బందితో దాడులు నిర్వహించారు. దాడుల్లో నలుగురిపై కేసులు నమోదు చేసి 160 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్ మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, తయారీకి ఉపయోగించే సామగ్రి కలిగి ఉన్నా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిగి, కొడంగల్ ఎక్సైజ్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలి : ఎంపీ అరుణ



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ, తదితరులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతీ మనిషి ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. బుధవారం కొందుర్గులోని ఉమామహేశ్వర అభయాంజనేయ స్వామి ఆలయంలో కొనసాగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. దైనందిన జీవితంలో ప్రజలు ఒత్తిడికి గురికాకుండా ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని, సమాజానికి మేలు జరిగే విధంగా పూజాధికాలు, యజ్ఞయాగాలు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు బాబయ్య, మనోహర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మోహన్‌సింగ్, శ్రీనివాస్, సుధాకర్, ప్రభు లింగంపటేల్, అంజయ్య, చంద్రశేఖర్, అశోక్, మాజీ వైస్ఎంపీపీ రాజేష్‌పటేల్, సుధాకర్‌రావు, కురుమయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ స్థలాన్ని పరిశీలించిన డీసీపీ

యాచారం, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి):మండలంలోని కుర్మిద్ద తండా వద్ద హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌ను నిర్మించే స్థలాన్ని బుధవారం మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ భవననిర్మాణం పూర్తయితే అన్ని ప్రాంతాలకు అనువుగా ఉంటుందా? అని ఏసీపీ కేపీవీ.రాజును అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణం చేపడితే బాగుంటుందని చెప్పారు. భవనం నిర్మించే సమయంలో నీటి వసతి ఉంటుందా? అని ఆరా తీశారు. అలాగే డీసీపీ ఫ్యూచర్‌సిటీ, స్కిల్ యూనివర్సిటీల స్థలాలను సైతం పరిశీలించారు. కేటాయించిన స్థలాల్లో పోలీసు భద్రతను ఏర్పాటు చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. ఆమె వెంట సీఐ కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డి తదితరులు ఉన్నారు.



పోలీస్ స్టేషన్ నిర్మించే స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న డీసీపీ సునీతారెడ్డి

ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) ఫీజు చెల్లించాలని పాఠశాల యాజమాన్యం పెట్టిన వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలని మేడ్చల్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల మేడ్చల్‌లోని ప్రైవేట్ పాఠశాలలో ఫీజులు చెల్లించాలని యాజమాన్యం వేధించిందంటూ విద్యార్థిని అఖిల ఆత్మహత్య చేసుకుంది. పాఠశాల యాజమాన్యం వారితో చర్చలు జరపటానికి బీజేపీ నాయకులు బుధవారం పాఠశాలకు వెళ్లారు. యాజమాన్యం చర్చలకు రాకపోవడంతో బీజేపీ నాయకులు తరగతులను బహిష్కరించి విద్యార్థులను ఇళ్లకు పంపారు. పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేస్తామని తమ నాయకులకు కబురు పంపి రాకపోవడం సరికాదన్నారు. పట్టణ అధ్యక్షురాలు శైలజ మాట్లాడుతూ... పాఠశాల యాజమాన్యం తనతప్పును కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, ప్రేమ్‌దాస్, శ్రీనివాస్‌గౌడ్, వంశీవిజయ్, వంశీధర్‌రెడ్డి, రాగం అర్జున్ అవినాశ్ చారి, గౌళీకర్ మహేష్, విష్ణుగౌడ్, రథన్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు దైవచింతన కలిగి ఉండాలి : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ

పూడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు దైవచింతన కలిగి ఉండాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సోమన్‌గుర్తి గ్రామం హనుమాన్ ఆలయంలో జరుగుతున్న నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఆంజనేయస్వామి చిత్రపటం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

పరిగి: పరిగి పట్టణంలో గల అనంతరెడ్డినగర్‌లోని శ్రీ భ్రమరాంభమల్లికార్జునస్వామి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజును పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఎమ్మెల్యేతోపాటు, నాయకులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో నాయకులు బి.పరశురాంరెడ్డి, అనెం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చకచకా పనులు

- పరిగిలో రూ.15.5కోట్లతో నీటి సరఫరా వ్యవస్థ
- నాలుగు ట్యాంక్‌లు, పైప్‌లైన్ల నిర్మాణం



పరిగిలోని తిరుమల వెంచర్‌లో ట్యాంక్ నిర్మాణం కోసం తీసిన మట్టి

పరిగి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పరిగి మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి సమస్య పరిష్కారానికి మోక్షం లభిస్తోంది. ఈ పనులకు కేంద్రప్రభుత్వం అమృత్-2 కింద పరిగికి రూ.15.5కోట్లు మంజూరు చేసింది. గత నవంబరు 25న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. టెండర్ పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. నీటి సరఫరాకు సంబంధించి పనులు పనులు చకచకా జరుగుతున్నాయి. కొత్తగా వేయనున్న పైపులు వచ్చాయి. ట్యాంక్‌ల నిర్మాణ పనులు, పైపులైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కొత్తగా నాలుగు వాటర్ ట్యాంక్‌లు నిర్మిస్తారు. 16.5లక్షల లీటర్ల సామర్థ్యం గల నాలుగుట్యాంక్‌ల పనులు ప్రారంభమయ్యాయి. తిరుమల వెంచర్‌లో ఐదు లక్షల లీటర్లు, 2.5లక్షల లీటర్లు,వేంకటేశ్వరకాలనీలో 4లక్షల లీటర్లు, తహసీల్దార్ ఆఫీసు వద్ద ఐదు లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్‌లను నిర్మిస్తున్నారు. జాఫర్‌పల్లి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నుంచి నీరు తరలిస్తారు. పరిగి మున్సిపాలిటీలో 30.759కి.మీ పొడవున పైపులైన్లు వేస్తారు. 350 ఎంఎం, 300ఎంఎం, 250ఎంఎం, 200ఎంఎం, 110ఎంఎం పైపులను వినియోగిస్తున్నారు. మెయిన్ గ్రావిటీ పైపులైన్లు 7.053కి.మీ కాలనీలకు సరఫరాకు 12.81కి.మీ, ఇళ్ల నల్లా కనెక్షన్‌కు 10.896కి.మీ పొడవైన పైప్‌లైన్ వేస్తారు. ప్రస్తుతం మునిసిపాలిటీలో 5,132 ఇళ్లు ఉంటాయి. వీటికి ఆరువేలకుపైగా నల్లా కనెక్షన్‌లున్నాయి. పరిగిలో 18,541 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో కాగా ఆరు గ్రామాల విలీనంతో ఓటర్ల సంఖ్య పెరుగనుంది. కొత్తగా 6,650 మంది ఓటర్లు మునిసిపల్ పరిధిలోకి వచ్చారు. విలీన గ్రామాల జనాభా కలిపితే 40వేల వరకు ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న ఆరు వేల నల్లా కనెక్షన్లతో కొత్తగా 1,349 కనెక్షన్లు ఇస్తారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులు గడువు విధించారు. ఈ పనులు పూర్తయితే పట్టణానికి ఇక మంచి నీటి సమస్య శాశ్వతంగా తీరనుంది.





పట్టణంలో వేసేందుకు వివిధ ప్రాంతాల్లో డంప్ చేసిన పైపులు

రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సర ముగింపులోపు విద్యా, గృహ రుణాల లక్ష్యాలను పూర్తిచేయాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్, డీసీసీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డీసీసీ, డీఎల్ ఆర్సీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 2024-25ఆర్థిక సంవత్సరం ముగింపులోపు రుణాల లక్ష్యాలను పూర్తి చేయాలని బ్యాంకర్లకు సూచించారు. వార్షిక రుణ ప్రణాళిక కింద బ్యాంకుల పనితీరు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, ఎజెండా అంశాలపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. 2025-26 సంవత్సరానికి నాబార్డ్ ద్వారా పొటెన్షియల్ లింక్ క్రెడిట్ ప్లాన్ కరదీపికను జిల్లా అదనపు కలెక్టర్ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని బ్యాంకులు చురుకుగా రుణాలిచ్చి వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

జైపూర్ ఎన్ఐటీతో సెయింట్ పీటర్స్ ఒప్పందం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): 'ఏఐ ఫర్ సెక్యూరిటీ అండ్ సెక్యూరిటీ ఫర్ ఏఐ డిజిటల్ ట్విన్' అనే అశంపై జైపూర్ ఎన్ఐటీతో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బుధవారం కళాశాల గ్యాలరీలో నిర్వహించిన కార్యక్రమంలో రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో చోటు చేసుకుంటున్న విప్లవాత్మక మార్పులపై డిజిటల్ ట్విన్ ద్వారా రెండు విద్యాసంస్థల ప్రతినిధులు పూర్తి అధ్యయనం చేసి తమ విద్యార్థులకు బోధిస్తారని ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ జైపూర్ ఎన్ఐటీ ప్రతినిధి డాక్టర్ బి.రమేష్‌బాబు, కళాశాల కార్యదర్శి టి.వి.రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సరోజ రెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అమజాన్‌షేక్, డాక్టర్ వెంకట్, పీఆర్వో రవిసుధాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15శాతం కేటాయించాలి

తాండూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యపై 15 శాతం నిధులు కేటాయించాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, బాలకార్మిక విమోచన వేదిక ప్రతినిధి ఎస్.జనార్ధన్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల విద్యకు గతంలో బడ్జెట్ కేటాయింపుల్లో శ్రద్ధచూపక విద్యావ్యవస్థ సంక్షోభంలో ఉందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో రెండేళ్లకు మౌలిక వసతుల కల్పనకు రూ.4వేల కోట్లు కేటాయించినా ఆ నిధులు ఖర్చుపై ప్రణాళికలు చేయలేదన్నారు. పాఠశాలల నిర్వహణ, భవనాల నిర్మాణం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, మొదలైన అంశాలకు సరిపడా నిధులు కేటాయించాలని సూచించారు.

జాబ్‌మేళాలో 40 మందికి ఉద్యోగాలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపిక చేసిన 50 మందిలో 40మంది మహిళలు, యువతులు ఉద్యోగాలు సాధించారు. జాబ్‌మేళా ద్వారా ఎంపిక చేసిన వారికి బుధవారం తుక్కుగూడ సమీపంలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆమనగల్లు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో 40 మంది ఉద్యోగాలు సాధించినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఎంపికైన వారికి కంపెనీ నిర్వాహకులు ఉద్యోగ నియామకపత్రాలు అందజేసినట్లు చెప్పారు.

కిరాణా షాపులు, హోటళ్ల తనిఖీ

కేశంపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంగెం గ్రామంలో బుధవారం రాత్రి కేశంపేట సీఐ నరహరి నేతృత్వంలో తనిఖీలు చేపట్టారు. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి ఆదేశాలతో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, 12మంది పీసీలు, 10మంది ఏఆర్ ఫోర్స్‌తో తనిఖీలు చేపట్టినట్లు సీఐ వివరించారు. 12 కిరాణా దుకాణాలు, హోటళ్లలను తనిఖీ చేసి, 25 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా మూడు ఎక్సైజ్ కేసులు నమోదు చేశామని ఆయన చెప్పారు.

బ్లాక్‌లిస్టులో పట్టా భూములు

- వర్తించని 'రైతు భరోసా'
- సాగు భూమి ఉన్నా.. ప్రభుత్వ పథకాలకు నోచని రైతులు
- బ్లాక్‌లిస్ట్ నుంచి తొలగించని రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు



బ్లాక్‌లిస్టులో ఉన్న తమ్మలోనిగూడలోని సాగు భూమి

యాచారం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సాగుకు యోగ్యంగా లేని భూముల వివరాలపై రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారుల సర్వే తప్పుల తడకగా మారడంతో రైతులకు ప్రభుత్వ పరంగా సాయమందక ఇబ్బందుల పాలవుతున్నారు. సాగుకు అనుకూలంగా ఉన్న భూములను సాగుకు యోగ్యంగా లేనట్లుగా తప్పుడు రికార్డులు మార్చారని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన సర్వేచేసి ఉన్నతాధికారుల మెప్పు కోసం తప్పుల తడకగా సర్వే చేశారని రైతులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. యాచారం మండలం మొగుళ్ల వంపు గ్రామానికి చెందిన యాదగిరిరెడ్డి, జంగారెడ్డి రైతులకు సర్వే నెంబర్ 49లో నాలుగెకరాల సాగు భూమి ఉంది. దీని పక్కనే ఓ వెంచర్ ఉండడంతో వీరి భూమిని కూడా అధికారులు బ్లాక్‌లో పెట్టారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సాగు భూములను బ్లాక్‌లిస్టులో పెట్టారని అధికారులకు వివరించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్లవెల్లి రెవెన్యూ పరిధిలోని తమ్మలోనిగూడలో కాలె బీరయ్య, చంద్రయ్య, శివయ్యగౌడ్‌లకు చెందిన సర్వేనెంబర్ 821, 827లలో ఉన్న పదెకరాల సాగు భూములను బ్లాక్‌లిస్టులో పెట్టారని వారు ఆందోళన చెందారు. తమ సాగుభూముల పక్కన వెంచర్ ఉంటే తమ భూములను బ్లాక్‌లిస్టులో పెట్టడం ఎంతవరకు న్యాయమని రైతులు ప్రశ్నిస్తున్నారు. తమ భూములను బ్లాక్ లిస్టు నుంచి తొలగించాలని రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరగడం లేదని ఆయా గ్రామాల రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. మంతన్‌గౌరెల్లి, కొత్తపల్లి, మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, నందివనపర్తి, చౌదర్‌పల్లిలో సాగు భూములను బ్లాక్‌లిస్టులో పెట్టారని రైతులు వాపోతున్నారు. అధికారులు పంట పొలాలు తిరిగి సర్వే చేయాల్సి ఉండగా కేవలం రైతు వేదికలో ఉండి ఆన్‌లైన్‌లో భూములను చూసి బ్లాక్‌లిస్టులో పెట్టడం ఎంతవరకు న్యాయమని రైతులు ప్రశ్నిస్తున్నారు. వారం రోజుల్లో తమ భూములను బ్లాక్‌లిస్టు నుంచి తొలగించకపోతే యాచారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని ఈ సందర్భంగా రైతులు చెబుతున్నారు.

బ్లాక్‌లిస్టు నుంచి తొలగించాలి



మా అన్నదమ్ములకు 8 ఎకరాల సాగు భూమి ఉంది. తాతల కాలం నుంచి సాగు చేసుకొని బతుకుతున్నం. ఏ ఆధారంతో మా భూములను బ్లాక్‌లిస్టులో పెట్టారో అధికారులు సమాధానం చెప్పలేపోతున్నారు. బ్లాక్ లిస్టు నుంచి తొలగించి న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తాం.

- శివయ్యగౌడ్, తమ్మలోనిగూడ

భూముల వివరాలిస్తే వెంటనే తొలగిస్తాం



సాగు భూములు బ్లాక్‌లిస్టులో ఉంటే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే మరోమారు విచారణ చేసి న్యాయం చేస్తాం. రైతులు ఆందోళన చెందరాదు. ఏయే భూములు బ్లాక్‌లిస్టులో ఉన్నాయో మాకు పట్టాపాస్‌బుక్‌తో ఫిర్యాదు చేస్తే తక్షణమే వాటిని తొలగిస్తాం.

- రవినాథ్, మండల వ్యవసాయాధికారి

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని రైతు దుర్మరణం

- రోడ్డు దాటుతుండగా ఘటన



వెంకట్‌రెడ్డి (ఫైల్)

చేవెళ్ల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పొలం పనులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైన ఓ రైతు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధి గుండాల గేట్ వద్ద చోటుచేసుకుంది. పోలీస్‌ల కథనం మేరకు.. చేవెళ్ల మండల పరిధిలోని అల్లావాడ గ్రామానికి చెందిన యాలాల వెంకట్‌రెడ్డి (60) రోజు మాదిరిగానే బుధవారం వ్యవసాయ పొలంలో పనులు ముగించుకొని ఇంటికి తిరుగు పయనమయ్యాడు. ఈక్రమంలో బెంగళూర్-ముంబయి జాతీయ రహదారి దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. వెంకట్‌రెడ్డి రోడ్డుపై పడిపోవడంతో అటుగా వెళ్తున్న వారు గమనించి చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నగరంలోని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా చేవెళ్ల పట్టణం దాటుతుండగానే మృతిచెందాడు. మృతుడు వెంకట్‌రెడ్డికి భార్య, ముగ్గురు కుమారులున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

కేశంపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గంజాయి జంగమ్మ(70) వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను చూడడానికి వచ్చిన ఆమె పక్కనే ఉన్న చెరువు వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. ఎవరూ గమనించక పోవడంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీఐ నరహరి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీయించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

- తప్పిన పెను ముప్పు

చేవెళ్ల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అతివేగం, అజాగ్రత్తగా వాహనం డ్రైవ్ చేయడంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొన్న ఘటన బుధవారం సాయంత్రం చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధి పామెన గేట్ వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ నుంచి చేవెళ్ల మీదుగా షాద్‌నగర్ వెళ్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా నడపడంతో పామెన గేట్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి రోడ్డుకు కొద్ది దూరంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఆ సమయంలో డ్రైవర్ ఒక్కడే ఉన్నాడు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. గమనించి ఇతర వాహనదారులు విద్యుత్ అధికారులకు సమచారం ఇచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. స్తంభం పూర్తిగా ధ్వంసమైంది. ఈ మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ-ట్రాక్టర్ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

చేవెళ్ల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న లారీ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా.. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ముడిమ్యాల్ గేట్ సమీపంలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీస్‌లు కథనం మేరకు.. లారీ హైదరాబాద్ నుంచి చేవెళ్ల మీదుగా తాండూర్ వెళుతోంది. ఈక్రమంలో హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు కాంట్రాక్టర్ మెగా కృష్ణారెడ్డికి చెందిన ట్రాక్టర్ రోడ్డు పనుల నిమిత్తం చేవెళ్లకు బుధవారం ఉదయం వస్తోంది. మార్గమధ్యలోని చేవెళ్ల మండల పరిధి ముడిమ్యాల్ గేట్ సమీపంలోకి రాగానే వెనుకనుంచి వస్తున్న లారీ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసే సమయంలో ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. లారీ డ్రైవర్ భానుప్రసాద్‌కు, ట్రాక్టర్ డ్రైవర్ వెంకన్నలకు తీవ్రగాయాలయ్యాయి. ట్రాక్టర్‌పై ఉన్న వెంకటేశ్, శ్రీను, నవీన్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీస్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మొయినాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. హైదరాబాద్ మలక్‌పేటకు చెందిన ఇమ్రాన్ (40) బుధవారం మొయినాబాద్ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళుతున్నాడు. జేబీఐటీ కాలేజ్ ఎదుట కారు ఆపి రోడ్డుపక్కన భోజనం విక్రయించే వారి వద్ద అన్నం తినేందుకు నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈక్రమంలో తాండూర నుంచి హైదరాబాద్‌వైపు వెళుతున్న ఓ కారు ఇమ్రాన్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో నెమలికి గాయాలు

చికిత్స అందించి అడవిలో వదిలిన అధికారులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై బుధవారం ఉదయం కుక్కల దాడిలో ఓ నెమలి తీవ్రంగా గాయపడగా అటవీ శాఖ అధికారులు చికిత్స చేయించి అడవిలో వదిలారు. బుధవారం ఉదయం ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్ మరో ఇదరు యువకులు వాకింగ్ చేస్తున్న సమయంలో నెమలిని కుక్కలు వెంబడించి గాయపరిచాయి. అటవీశాఖ అధికారులకు ఫోన్లో సమాచారమిచ్చారు. టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి నెమలిని పశువైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించి కోలుకున్న తర్వాత దగ్గర్లోని అటవీ ప్రాంతంలో వదిలారు.

శివాజీ స్ఫూర్తితో ముందుకు సాగాలి

- ప్రజాప్రతినిధులు, నాయకులు
- ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మాన్ని కాపాడిన గొప్ప ధీశాలి ఛత్రపతి శివాజీ మహారాజ్ అని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట శివారులోని సర్ధార్‌నగర్ చౌరస్తాలో బుధవారం ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాబయ్య, ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్, మాధవ్, ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : కొందుర్గు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో శివాజీ విగ్రహానికి ఎంపీ అరుణ పూలమాల వేసి నివాళుర్పించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు నివాళులర్పించారు. బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు బాబయ్య, మనోహర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మోహన్‌సింగ్, శ్రీనివాస్, సుధాకర్, ప్రభు లింగంపటేల్, అంజయ్య, చంద్రశేఖర్, అశోక్, మచ్చసుధాకర్‌రావు, కురుమయ్య, శ్రీనివాస్ కొందుర్గు మాజీ వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, చంద్రశేఖర్ తదితరులున్నారు.

తలకొండపల్లి : శివాజీ గొప్ప సాహస వీరుడని, ఆయన జీవితం, పోరాట పటిమ అందరికీ ఆదర్శ ప్రాయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో వివిధ సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతిలో ఎమ్మెల్యే పాల్గొని శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రభాకర్‌రెడ్డి, యాట నర్సింహ, మోహన్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, అంజయ్య, అజీం, యాదగిరి, మల్లేశ్, తదితరులున్నారు.

ఆమనగల్లు : మండల కేంద్రంలో సూర్యవంశ అరెకటికె సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు కమ్మేకార్ సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, బీజేపీ నాయకులు శ్రీకాంత్‌సింగ్, శ్రీశైలం, శివలు హాజరై నివాళులర్పించారు. శ్రీనివాస్, యాదిలాల్, నిరంజన్, శ్రీను, రమేశ్, తదితరులున్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీను ఆధ్వర్యంలో కోనాపూర్, రాంనుంతల, సీతారామ్‌నగర్ తండాలో భారీ ర్యాలీ నిర్వహించారు. కోనాపూర్ గేటు వద్ద సభ ఏర్పాటు చేశారు. ఆకిటి మల్లేశ్, ఆనంద్, తదితరులున్నారు.



ఆమనగల్లు : నివాళులర్పిస్తున్న నాయకులు



శంకర్‌పల్లి : బుల్కాపూర్‌లో శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

కడ్తాల్ : మైసిగండిలో శివాజీ జయంతి వేడుకలకు పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాయకులు హన్మనాయక్, వేణుగోపాల్, లాయక్‌అలీ, మల్లేశ్ గౌడ్, తదితరులున్నారు. ఏబీవీపీ నగర కార్యదర్శి నేనావత్ పవన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ వీరయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు మహేశ్, మాజీ అధ్యక్షుడు మన్యనాయక్, శ్రీకాంత్, మురళి, నరేందర్, అశోక్ రెడ్డి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

మంచాల : ఆరుట్లలో హిందూసేన ఆధ్వర్యంలో వివిధ పార్టీల నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని శివాజీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆనంగళ్ల యాదయ్య, లాలగారి శ్రీకాంత్, వెదిరె సికిందర్‌రెడ్డి, బత్తుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

యాచారం : యాచారం, నల్లవెల్లి, కుర్మిద్దలో శివాజీ జయంతి నిర్వహించారు. కుర్మిద్దలో విగ్రహానికి పలువురు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గ్రామాల్లో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. మాజీ సర్పంచ్ దేరంగుల రాజు, మాజీ ఎంపీటీసీ లక్ష్మిపతిగౌడ్, శేఖర్ తదితరులున్నారు.

కందుకూరు : శివాజీ జీవిత చరిత్రను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, కందుకూరు నవభారత్ యూత్ మాజీ అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్, చెన్నకేశవులు తెలిపారు. కందుకూరు, మండల కేంద్రంలో వేర్వేరుగా జయంతి నిర్వహించారు. బీజేపీ నాయకులు ఎస్.నర్సింహ్మారెడ్డి, కృష్ణకుమార్, ఎస్.భూమిరెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, కె.చెన్నారెడ్డి, రఘునందన్, యూత్ సభ్యులున్నారు.

శంషాబాద్ : మున్సిపల్ కేంద్రంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎయిర్‌పోర్టు నిర్వాసితులకాలనీలో శివాజీ విగ్రహంతో పాటు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వీహెచ్‌పీ నాయకులు వివేకానంద, కె.నర్సింహ, రాజు, సురేష్, సుందర్, ప్రవీణ్, ఉదయ్, తదితరులున్నారు.

మొయినాబాద్ : మండలంలోని కేతిరెడ్డిపల్లి స్టేజీ వద్ద మరాఠామంచ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, యువకులు పాల్గొన్నారు. యువకులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : యువత శివాజీ స్ఫూర్తితో ముందుకు సాగాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మహేష్ అన్నారు. పోమాల్‌పల్లిలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వేముల్‌నర్వలో యువజన సంఘాలు, గ్రామస్తులు శివాజీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కొత్తపేటలో బీజేవైఎం అధ్యక్షుడు పాలాది శ్రీనివాస్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యదర్శి ప్రసన్నలక్ష్మీ, యువజనసంఘం నాయకులు మనోహర్‌గౌడ్, రాఘవేందర్, మల్లేష్, శ్రీకాంత్, శివ, యాదయ్య, తదితరులున్నారు.

కొత్తూర్ : శివాజీ జయంతిని మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద శివాజీ విగ్రహానికి భజరంగ్‌దళ్ సభ్యులు పూజలు నిర్వహించారు. భజరంగ్‌దళ్ సంయోజక్ శివకుమార్, నరేష్‌చారి, శేఖర్‌గౌడ్, సందీప్‌సింగ్, ఉదయ్, సుమన్, రాంజీ, సురేష్, హర్ష, శ్రీను, రాజు, తదితరులున్నారు.

చేవెళ్ల : శివాజీని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి, బీజేపీ జిల్లా యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్ రెడ్డిలు అన్నారు. శివాజీ జయంతిని పురస్కరించుకుని చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు పట్టణకేంద్రంలో శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్, మధుసూదన్‌రెడ్డి, త్రినేత్ర, మల్లారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కార్యకర్తలు, నాయకులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



చౌదరిగూడ : కొందుర్గులో శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ డీకే అరుణ

శంకర్‌పల్లి : గోపులారం, మహారాజ్‌పేట్‌లతో బీజేపీ మండలాధ్యక్షురాలు లీలావతి భయానంద్ శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బీడీఎల్ చౌరస్తాలో భజరంగ్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. బుల్కాపూర్‌లలో శివాజీ విగ్రహానికి ఎమ్మెల్యే యాదయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహ, సర్పంచ్ నర్సింహరెడ్డి, కౌన్సిలర్ లక్ష్మమ్మరాంరెడ్డి, సొసైటీ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, తొండ యాదయ్య, రఘునందన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

షాబాద్ : యువత శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని ఆధ్యాత్మికవేత్త శంకర్‌రావు జాదవ్ అన్నారు. సర్దార్‌నగర్‌లో శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. గ్రామస్తులు జగదీశ్వర్‌గుప్తా, కుమార్, హరీష్, అశ్విని, ఉదయ్‌కుమార్ జాదవ్, శేఖర్, రాఘవేందర్, తదితరులున్నారు.

చేవెళ్ల : శివాజీని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. రావులపల్లిలో ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. గ్రామంలో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

మాడ్గుల : ఆర్కపల్లిలో జివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దండు శ్రీను, దుర్గారాం, దండు వెంకటయ్య, రామకృష్ణ, తోలు ప్రసాద్, లక్ష్మణాచారి ఏర్పుల సైదులు రాములు తదితరులు పాల్గొన్నారు.



యాచారం : నల్లవెల్లిలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ కార్యకర్తలు

గ్యాస్ సబ్సిడీకి మొండిచేయి!


(5వ పేజీ తరువాయి)

వాపోతున్నారు. తమకు మహాలక్ష్మి పథకం కింద రాయితీ సొమ్ము జమకాకపోవడంతో వినియోగదారులు రోజూ మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు మాత్రం జమ అవుతోందని చెబుతున్నారని, ఖాతాల్లో మాత్రం డబ్బులు పడడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. వంట గ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ రూ.40.71 జమ అవుతున్నాయంటున్నారు. ఈ విషయంలో కార్యాలయాల్లో వినియోగదారులు, అధికారుల మధ్య తరచూ వాగ్వాదం జరుగుతోంది. దాంతో ప్రజలకు సమాధానం చెప్పలేక ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. ఇకపోతే తెల్ల రేషన్ కార్డు లేని కారణంగా వంట గ్యాస్ రాయితీ డబ్బు జమ కావడం లేదని పౌరసరఫరాల శాఖ అధికారులు పొంతన లేని సమాధానం చెప్పి తప్పుకుంటున్నారు.

సమాచారం లేక ఇబ్బందులు

జిల్లాలో 13,39,852 ఎల్‌పీజీ కనెక్షన్లుండగా మహాలక్ష్మి పథకం కింద 2,08,203 మంది లబ్ధిదారులున్నారు. జిల్లాలో మహాలక్ష్మి పథకం అమలుపై ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధ తీసుకోకపోవడంతో పథకం నీరుగారిపోయిందని పలువురు అధికార పార్టీ నేతలే మాట్లాడుకుంటున్నారు. జిల్లాలో ఏయే గ్యాస్ కంపెనీలున్నాయి, రూ.500కే గ్యాస్ అమలవుతుందా, లేదా? అనే ఖచ్చితమైన సమాచారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల వద్ద లేదు. జనవరి 28 నాటికి జిల్లాలో రూ. 17.57 కోట్లు రాయితీ డబ్బు వినియోగదారుల ఖాతాలో జమ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. వంట గ్యాస్ ఆన్‌లైన్‌లో బుక్ చేసిన నాలుగు రోజులకు వంట గ్యాస్ పంపిణీదారులు వినియోగదారుల ఇండ్లకు వంట గ్యాస్ అందిస్తున్నారు. గ్యాస్ తీసుకున్న మూడు రోజులకు వినియోగదారుల ఖాతాల్లో రూ.40.71 పైసలు మాత్రమే జమ చేసినట్లు లబ్ధిదారుల ఫోన్‌లకు సమాచారం వస్తుంది.


రాయితీ డబ్బులు పడడం లేదు



వంట గ్యాస్ రాయితీ కోసం గ్రామపంచాయతీ కార్యాలయంలో, ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నా. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా బుక్ జత చేసి దరఖాస్తు ఇచ్చాను. వంట గ్యాస్ రాయితీ డబ్బు రావడం లేదని మండల కార్యాలయంలో అడిగితే వస్తదని చెబుతున్నారే తప్ప డబ్బులు మాత్రం జమకావడం లేదు.

- జయప్రద, గృహిణి, గడ్డమల్లాయగూడ

రూ.40.71 మాత్రమే జమ అవుతున్నాయి



నాకు వంట గ్యాస్ రాయితీ డబ్బు బ్యాంక్ ఖాతాలో జమ కావడం లేదు. చాలా సార్లు బ్యాంక్‌కు పోయి అడిగిన. అదేవిధంగా మండలాఫీస్‌లో కూడా అడిగినా. అధికారులు రాయితీ డబ్బు వస్తదని చెబుతున్నారు. కానీ, నా ఖాతాలో వేయడం లేదు. గ్యాస్‌కు రూ.900 తీసుకుంటున్నారు. గ్యాస్ తీసుకున్న నాలుగు రోజులకు రూ.40.71 మాత్రమే జమ చేస్తున్నారు.

- హంసమ్మ, గృహిణి, యాచారం

అధ్వానం.. అతిథి గృహం

(5వ పేజీ తరువాయి)

స్థలంలో నూతన భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిజాం కాలంలో నిర్మించిన అతిథి గృహం ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో కొనసాగుతుంది. ఆ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఏళ్ల చరిత్ర కలిగిన భవనం శిథిలావస్థకు చేరుకుంది. అయితే ఇక్కడి ఎమ్మెల్యే, ఎంపీ సైతం పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను గుర్తించి కొత్తభవనం నిర్మించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించాలి

అతిథి గృహం స్థలంలో నూతన భవనం నిర్మించాలి. ఇక్కడే ప్రభుత్వ ఆసుపత్రిని సైతం నిర్మించాలి. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి సైతం అతిథి గృహం పక్కనే ఉంది. అతిథి గృహానికి ఎకరం, మిగతా స్థలంలో ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించాలి. అధికారులు, స్థానిక నాయకులు పట్టించుకోవాలి.

- రామస్వామి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

సంక్షిప్తంగా..

కొత్తూర్ : స్థానిక ఉన్నత పాఠశాలలోని వాటర్ ఫిల్టర్ మరమ్మతుకు నోచుకోలేకపోవడంతో విద్యార్థులు మంచినీటి కోసం అవస్థలు పడుతూ వస్తున్నారు. గమనించిన కౌన్సిలర్ హేమా దేవేందర్‌ముదిరాజ్ నగదును పీఈటీ నవనీతకు అందజేశారు. కౌన్సిలర్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

యాచారం : మహిళలు విలువైన ఆభరణాలు ధరించి ఒంటరిగా వెళ్లరాదని, గుర్తుతెలియని వ్యక్తుల మాటలు నమ్మి అడిగిన వస్తువులు ఇచ్చి మోసపోరాదని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డిలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం కుర్మిద్దలో ప్రజలతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు.

కేశంపేట : వేముల్‌నర్వలోని హనుమాన్ ఆలయానికి దాతల సాయంతో గ్రిల్స్ ఏర్పాటుచేశారు. గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ సునీతాసురేందర్‌రెడ్డి, కాసోజు నర్సింహాచారి, గంగన్న గూడెం గోపాల్‌లు రూ.50వేలతో ఆలయం చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయించారు. ఆలయానికి రక్షణలో భాగంగా గ్రిల్స్ వేయించినట్లు దాతలు తెలిపారు. దాతలను గ్రామస్తులు అభినందించారు.

శంషాబాద్ రూరల్ : ఈ నెల 5న హైదరాబాద్ నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరిన ఇస్లామిక్ మతస్తులు తిరిగి బుధవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులు వారికి ఘనస్వాగతం పలికారు.


తలకొండపల్లి : గట్టిప్పలపల్లికి చెందిన 52మంది రైతులకు సబ్సిడీ కింద స్ప్రింక్లర్లు మంజూరయ్యాయి. గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి రైతులకు వాటిని పంపిణీ చేశారు.

ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణ అరెకటికె సంఘం అధ్యక్షుడిగా కామ్లెకార్ సుభాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో సంఘం నాయకులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుభాష్, ఉపాధ్యక్షుడిగా మల్కేడి యాదిలాల్‌లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అరెకటికె సంఘం నాయకులు సత్కరించి అభినందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కేశంపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెదురువెళ్లి భాస్కర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని నిర్ధవెల్లిలో బుధవారం రూ.5లక్షల సీఆర్ఆర్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అడిగిన వెంటనే నిధులు విడుదల చేసిన ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అమీర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా గిరి




శంషాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రానికి చెందిన నర్రా గిరి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. నగరంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం నాలుగవ సభలో ఆయన్ను సంఘం నాయకులు ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ దుకాణం సీజ్

ఆమనగల్లు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రేషన్ దుకాణాల్లో దాడులు నిర్వహించారు. డీటీ భాను స్థానిక ఆర్ఐలు చెన్నకేశవులు, సంపత్‌లతో కలిసి రికార్డులను పరిశీలించారు. దుకాణ రికార్డులకు, స్టాక్‌కు తేడా ఉండడంతో ఓ రేషన్ దుకాణాన్ని సీజ్ చేశారు. ఈ విషయమై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆమనగల్లు ఏడీఏగా శోభారాణి



ఆమనగల్లు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ శాఖ ఏడీఏగా కె.శోభారాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏడీఏ ఆదిలక్ష్మి రాజేంద్రనగర్ ఎఫ్‌టీసీకి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో హైదరాబాద్ హాకా నుంచి శోభారాణి బదిలీపై ఆమనగల్లుకు వచ్చారు. రైతులకు అందుబాటులో ఉంటూ పంటల సాగులో సలహాలు, సూచనలు అందిస్తానని తెలిపారు. ఏవో శ్రీనివాస్ గౌడ్, ఏఈవోలు శోభారాణిని సత్కరించారు.

'కాంగ్రెస్‌పై ప్రజల తిరుగుబాటు'

కడ్తాల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హామీల అమలులో పూర్తిగా విఫలమై ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదని, ప్రజల తిరుగుబాటు మొదలైందని బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. కడ్తాల మండలం గోవిందాయిపల్లి తండాకు చెందిన పలువురు యువజన కాంగ్రెస్ నాయకులు కడ్తాల మండల కేంద్రంలో బుధవారం దశరథ్ నాయక్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో కేతావత్ గణేశ్, పాత్లావత్ జైపాల్, కేతావత్ గోపాల్, సభావట్‌మునీందర్, సభావట్ దశరథ్, సభావట్ నరి, సభావట్ మల్లేశ్ తదితరులు ఉన్నారు. మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఎంపీటీసీలు లచ్చిరామ్ నాయక్, ప్రియరమేశ్, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులున్నారు.